క్లుప్తంగా

మల్లేశ్వర స్వామికి అన్నాభిషేకం



అనపర్తి: స్థానిక మార్కండేయపురంలో వేంచేసి ఉన్న భద్రావతి సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి ఆదివారం అన్నాభిషేకం నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఎ.రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామికి అన్నాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దుర్గామల్లేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

సూర్యదేవునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పండితులు పంచామృతాభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం కావడంతో సూర్యదేవుడి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

సంపరలో శ్రీరామ సప్తాహాలు

పెదపూడి: మండలంలోని సంపర రామాలయంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న 58వ శ్రీరామ సప్తాహాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ అర్చకులు గంగాధర్‌భట్ల విష్ణుశర్మ, ప్రముఖ పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రూ.1.18 లక్షల నగదు స్వాధీనం

రంగంపేట: వాహన తనిఖీల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.18 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం మెజిస్ట్రేట్ పి.వెంకటరత్నం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని రామేశ్వరంపేట వద్ద ఏడీబీ రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఉదయం యానాం నుంచి రాజమహేంద్రవరం కారులో వెళుతున్న కోనాల యశ్వంత్‌రెడ్డి ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.18 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో రంగంపేట ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నిరీక్షణ, ఎస్‌ఈబీ కానిస్టేబుల్ కె.ఆదినారాయణ, ఎఫ్‌బీఓ జి.వెంకటలక్ష్మి, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది జీవీఎస్ఎస్ రెడ్డి, వీఆర్‌ఓ దొరబాబు పాల్గొన్నారు.

అసభ్యకర ప్రవర్తనపై కేసు

సీతానగరం: నాగంపల్లికి చెందిన కొండపల్లి శాంతి ఇచ్చిన ఫిర్యాదుపై అసభ్య ప్రవర్తనపై కొయ్య అరవాలుపై కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ ఆదివారం తెలిపారు. శాంతికి ఇద్దరు కుమారులు, ఏడేళ్ల కుమార్తె ఉన్నారు. శాంతి తన భర్త నాగరాజుతో కలిసి శనివారం ఉదయం పనిలోకి వెళ్లగా తన అన్నయ్య అరవాలు ఇంటికి వచ్చి ఒంటరిగా తన కుమార్తెతో అసభ్యకరంగా ప్రవర్తించాడని శాంతి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్

బిక్కవోలు: ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బిక్కవోలులో చోటుచేసుకుంది. ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం రాజఒమ్మంగి మండలం ఒట్టిగడ్డ గ్రామానికి చెందిన ఆవుగడ్డ ప్రసాద్‌కు పది నెలల క్రితం అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం కొత్త యల్లవరం గ్రామానికి చెందిన మద్దు చిన్ని(24)తో వివాహమైంది. ప్రసాద్ ప్రస్తుతం బలభద్రపురంలోని సచివాలయం-3 వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండడంతో బిక్కవోలులో ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడే కాపురముంటున్నారు. శనివారం రాత్రి ప్రసాద్, చిన్ని గొడవ పడి వేరు వేరు గదుల్లో నిద్రపోయారు. ఆదివారం ఉదయం తెల్లవారాక ప్రసాద్ ఆమె గది వద్దకు వెళ్లి ఎంతసేపు పిలిచినా పలకకపోయేసరికి చుట్టుపక్కల వ్యక్తుల సాయంతో తలుపు బద్దలుకొట్టారు. అప్పటికే చిన్ని ఉరేసుకుని ఉండడంతో కిందకు దింపి చూసేసరికి చనిపోయింది. ఘటనా స్థలాన్ని ఈస్ట్ జోన్ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, ఎస్‌ఐ పి.బుజ్జిబాబు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలు చిన్ని తండ్రి మద్దు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ తెలిపారు.

స్ఫూర్తిప్రదాత అంబేడ్కర్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



కోరుకొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గణేష్



'నన్నయ' వర్సిటీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన వీసీ ఆచార్య పద్మరాజు



గండ్రేడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ కేతా తులసి

అనపర్తి: అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్ అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం విశాఖపట్టణంలో నిర్వహించిన విశాఖపట్టణం పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న రెడ్డి సామాజిక వర్గీయుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ జయంతి సందర్భంగా విశాఖపట్టణం ఎల్ఐసీ బిల్డింగ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతరాలు లేని భారతీయ సమాజం కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కొమరిపాలెం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, పాదూరి డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

అనపర్తి ఏరియా ఆసుపత్రిలో....

అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ నిర్మలాచారి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీల అభ్యున్నతికి విశేష కృషి

పెదపూడి: ఎస్సీల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీపీ కేతా తులసి అన్నారు. గండ్రేడు గ్రామంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎంపీపీ తులసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు జిల్లా బీసీ సెల్ కన్వీనర్ కేతా శ్రీను తదితరులు పాల్గొన్నారు. సంపరలో పెదపూడి ఎస్ఐ శోభన్‌కుమార్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదపూడిలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు యార్లగడ్డ అమ్మన్న చౌదరి, నల్లమిల్లి గంగిరెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

అసమానతలు తొలగించారు

రంగంపేట: సమాజంలో అసమానాతలు తొలగించి సమానత్వం పెంపొందించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ కాలనీలో నిర్వహించిన అంబేడ్కర్ 133వ జయంతి వేడుకల్లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

బహుముఖప్రజ్ఞాశాలి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

మధురపూడి: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బహు ముఖప్రజ్ఞాశాలి అని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ కొనియాడారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని కోరుకొండ మండలంలో వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన గణేష్ మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. దోసకాయలపల్లిలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, కోరుకొండ ఎంపీటీసీకో-ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి ప్రవీణ, కేతినేడి అశోక్, తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, కోడూరి సత్తిరెడ్డి, కడవల శివ, కొండ, సర్పంచులు పాల్గొన్నారు.

'నన్నయ'లో అంబేడ్కర్ జయంతి

రాజానగరం: సమాజంలో మార్పు రావాలంటే అది విద్యతోనే సాధ్యమని నమ్మిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. అంబేడ్రర్ జయంతిని యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్యాంపస్‌లో సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వక్తృత్వం, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతు కూలీ కాలనీలో అంబేడ్కర్ జయంతి

రాజానగరం: సూర్యారావుపేటలోని రైతు కూలీ సంఘం కాలనీలో ఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరిగాయి. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు, దుర్గాప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని తహసీల్దారు జి. కనకరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, స్థానికులు పాల్గొన్నారు.

మధురపూడి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో బలహీనవర్గాలు అన్ని రంగాల్లో రాణించాలని రాజమహేంద్రవరం నార్త్‌జోన్ డీఎస్పీ కండే శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కోరుకొండ మండలం జంభూపట్నంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జయంత్యుత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఆటలపోటీ ల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జంభూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా జగనన్న పాలన

- ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



సూర్యారావుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



కొండగుంటూరులో రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ఇనుగంటివారిపేట ఎస్సీపేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజశ్రీ



సీతానగరం ఎస్సీపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన నాయకులు

రాజానగరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలననను అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మండలంలో సూర్యారావుపేట, శ్రీకృష్ణపట్నం, భూపాలపట్నం, పాతతుంగపాడు, కొత్తతుంగపాడు, జి.యర్రంపాలెం, కొండగుంటూరులలో అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండగుంటూరులో నిర్వహించిన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ వ్యక్తి అంబేడ్కర్

సీతానగరం: భారత రాజ్యాంగ రూపకర్త, నవ సమాజ స్థాపకుడు భారతరత్నం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచం గర్వించదగ్గ మహోన్నతమైన వ్యక్తి అని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. ఆదివారం ఇనుగంటివారిపేట ఎస్సీపేట వద్ద డాక్టర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా సర్పంచ్ సత్యం రాంపండు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె ప్రారంభించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సహభక్తి భోజన కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు గాడి రవికుమార్, బట్టు వెంకటరాజు, ఏసు, తవిటికి శేఖర్, రాజు, షేక్ ఇబ్రహీం, కుంచె అచ్యుతరామారావు, కొప్పుల పాణి, కొండాటి ప్రసాద్, గాడి ఏసు దాసు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో..

సీతానగరంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు ఆధ్వర్యంలో మదర్ థెరిసా సెంటర్‌లో డాక్టర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించి, వృద్ధులకు పండ్లు, రొట్టెలు, స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌బాబు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు. చినకొండేపూడిలో సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. చిడిపి బంగారయ్య, తాతిపూడి దానియేలు, గిడుగు పెద్దబ్బులు, చిడిపి దావీదు, గెద్దం పోశియ్య తదితరులు పాల్గొన్నారు. ముగ్గళ్లలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మట్టాడి వెంకట రమణ, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. దళిత నాయకులు దాసి వెంకట్రావు ఆధ్వర్యంలో మూడు వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. సింగవరం తదితర గ్రామాలలో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సీపీఐ ఎంఎల్ ఎమ్మెల్యే అభ్యర్థి పలివెల వీరబాబు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి జగన్ నాయకత్వం అవసరం



ఆత్మీయ సమ్మేళనంలో రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం అవసరమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం విశాఖపట్టణంలోని బొత్సా స్క్వేర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన విశాఖపట్టణం, పరిసర ప్రాంతాల రెడ్డి సామాజిక వర్గీయుల ఆత్మీయ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అవినీతి, పక్షపాతానికి తావులేకుండా బడుగు, బలహీన వర్గాలు, నిరుపేదలకు అండగా ఉంటూ అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రాన్ని దేశంలో ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ఐదేళ్లు సుపరిపాలన అందించిన వైఎస్సాస్‌సీపీకి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీకి అఖండ విజయాన్ని అందించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- పందలపాకలో ఎన్నికల ప్రచారం



పందలపాకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి



అనపర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

బిక్కవోలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఇంటింటికీ మేలు చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. మండలంలోని పందలపాకలో ఆదివారం ఆమె ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తున్న ఆమెకు మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉండేలా సీఎం జగన్ ప్రతి గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారన్నారు. వీటికి అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటుచేసి గ్రామంలోనే అన్ని సేవలను అందిస్తున్నారన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా వలంటీర్లను నియమించి ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలను చేరవేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తు ఓటు వేసి తన భర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, ఎంపీపీ కర్రి గీతాసావిత్రి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొద్దు ముత్యాలరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, సొసైటీ డైరెక్టర్లు పడాల వీర్రాఘవరెడ్డి, వంక శ్రీను, యాసలపు శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు పడాల దుర్గారెడ్డి, గండి రామతులసి, పడాల రామారెడ్డి, గొలుగూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

అనపర్తి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జగరుతుందని ఎమ్మెల్యే సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక ఇందిరానగర్, సునందనపేట, శ్యామలనగర్, బాబానగర్, గోవిందరెడ్డిపేట, చెరువు గట్టు ప్రాంతాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించిందన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న ప్రస్తుత సమయంలో ప్రతిపక్ష పార్టీ నేతలు కొత్త డ్రామాలకు తెర లేపారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించిన ఆమె త్వరలో జరనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని, సీఎంగా వైస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

మోసపూరిత, వెన్నుపోటు రాజకీయాలకు నిలయం కూటమి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కోరుకొండలో టీడీపీ, జనసేనకు చెందిన 200 మంది చేరిక



కోరుకొండలో ప్రతిపక్షాల నాయకులను వైఎస్సార్ సీపీలోకి చేర్చుకుంటున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: మోసపూరితమైన, వెన్నుపోటు రాజకీయాలకు నిలయమైన చంద్రబాబు కూటమి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం కోరుకొండలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 200 మందిని వైఎస్సార్ సీపీలోకి చేరారు. పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి వారిని ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రీజనల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ నక్కా రాంబాబు, నాయకులు తిరుమలశెట్టి సత్యనారా యణ, తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్యనాయుడు, మహిళా నాయకులు శిరీష, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

సేవలతో చిరస్మరణీయుడయ్యాడు



డాక్టర్ వినయ్ సుంకర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని హెల్త్ సెంటర్ వద్ద డాక్టర్ వినయ్ సుంకర జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న డాక్టర్ వినయ్ విగ్రహానికి వీసీ ఆచార్య కె.పద్మరాజు పూలమాల వేసి, నివాళులర్పించారు. వైద్య వృత్తిని చేపట్టి, ఎంతో మంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, రోడ్డు ప్రమాదంలో అశువులు బాసిన డాక్టర్ వినయ్ సుంకర భౌతికంగా లేకపోయినా ఆయన పేరిట ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా తండ్రి సుంకర వెంకటేశ్వర్రావు అందిస్తున్న సేవలతో అందరి హృదయాలలో చిరంజీవిగా నిలిచాడన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో డాక్టర్ వినయ్ సుంకర్ పేరిట నెలకొల్పిన హెల్త్ సెంటర్ ద్వారా అందుతున్న వైద్య సేవలను వివరించారు. ఈ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పేదింటి మహిళలకు కుట్టు, అల్లికలలో ఉచిత శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు. దివాన్‌చెరువులోని ఫౌండేషన్ ప్రాంగణంలోను డాక్టర్ వినయ్ సుంకర జయంతి ఘనంగా జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలలోని వివిధ ప్రాంతాల నుంచి ఫౌండేషన్ ద్వారా మగ్గం వర్కు, కుట్టు మిషను, అల్లికలు, స్పీకింగ్ ఇంగ్లీష్, కంప్యూటర్ కోర్సు తదితర వాటిలో ఉచిత శిక్షణ పొందిన వారితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం వెంకటరెడ్డి, ఎస్ఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి

అనపర్తి: వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పులగం వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాలను వెంకటరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తు సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు సహాయక చర్యలు చేపట్టడం కంటే అసలు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. అగ్నిమాపక కేంద్రం అధికారి(ఎస్ఎఫ్ఓ) జె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 1944లో బొంబాయి షిప్ యార్డులో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో అసువులు బాసిన అగ్నిమాపక సిబ్బందిని స్మరించుకుంటూ ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకూ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. అగ్నిమాపక కేంద్రంలో అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

అన్నసమారాధన

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో కాలువ దుర్గమ్మ అమ్మవారి సంబరం అనంతరం ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పూజలు చేసి అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. వెయ్యి మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.